



ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందించాలి

ప్రొఫెసర్ కోదండరాం

అన్నివర్గాలను చైతన్య పరిచేది ఉపాధ్యాయుడే

ప్రొఫెసర్ కాశీం

విద్యతోనే సమసమాజ అభివృద్ధి : విమలక్క 7


యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలం

ఎమ్మెల్యే సునీతారెడ్డి

పీఏసీఎస్‌లు, ఫర్టిలైజర్ షాపుల వద్ద రైతుల బారులు 7

డంపింగ్‌యార్డ్‌తో తంటాలు 6

సిద్దిపేట మున్సిపాలిటీలో ఓ కాంట్రాక్టర్ కొన్ని నెలల క్రితం లక్షల రూపాయల విలువైన అభివృద్ధి పనులు పూర్తిచేశాడు. సకాలంలో బిల్లులు రాకపోవడంతో అధికారులను సంప్రదించగా, ఫండ్స్ లేవని సమాధానం ఇచ్చారు. పదేపదే అడిగిన తర్వాత, ఓ ఇంజనీరింగ్ అధికారి ఫైలు ముందుకు వెళ్లాలంటే కొంత మొత్తం చెల్లించాలని స్పష్టం చేశారు. దీంతో ఆ అధికారితో ఒప్పందం చేసుకున్నాక ఫైలు ముందుకు కదలడం, కొన్ని రోజులకే బిల్లు పాసై చెక్ చేతికందడం జరిగింది. ఈ సంఘటన సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో అవినీతి ఏ స్థాయిలో ఉందో స్పష్టం చేస్తోంది.



కమీషన్ కొట్టు.. బిల్లు పట్టు



సిద్దిపేట మున్సిపల్ కార్యాలయం

సిద్దిపేట మున్సిపల్‌లో వసూళ్ల బాగోతం
బిల్లు రావాలంటే ముట్టజెప్పాల్సిందే
లేదంటే ఫైల్ ముందుకు కదలదు
ఉన్నతాధికారుల మౌనంపై విమర్శలు

సిద్దిపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన సిద్దిపేట మున్సిపాలిటీలో అవినీతి వ్యవహారాలు పెచ్చుమీరుతున్నాయి. పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చేసిన పనులకు బిల్లులు కావాలంటే బిల్లులో 10 శాతంపైగానే కమీషన్‌గా ఇవ్వాలని బహిరంగంగా డిమాండ్ చేస్తున్నట్లు కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

ఒక్కో పనికి ఒక్కో రేటు

పట్టణాభివృద్ధి పనుల కోసం కోట్లాది రూపాయల టెండర్లు ఆమోదించిన తర్వాత, బిల్లులు చెల్లించడంలో ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లకు చుక్కలు చూపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు కూడా ఇప్పటికీ బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడేళ్లుగా మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయిందని పలువురు వాపోతున్నారు. బిల్లు చేయాలంటే మొత్తం పనిలో 10 నుంచి 15 శాతం చెల్లించాలని సదరు అధికారులు బాహాటంగానే అడుగుతున్నారని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. పలు సెక్షన్ల ఉద్యోగులు ఒక్కో పనికి ఒక్కో రేటు చొప్పున వసూలు చేసి, వాటాలు పంచుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జనరల్ ఫండ్స్ నుంచి బిల్లులు కావాలంటే ఒక రేటు, ప్రభుత్వం నుంచి నిధులు వచ్చినప్పుడు బిల్లులు చెల్లించాలంటే మరో రేటు చొప్పున వసూలు చేస్తున్నారని సమాచారం. బిల్లు కోసం అధికారికి ముందుగా కొంత చెల్లించి, మిగతాది చేతికి చెక్కు అందిన తరువాత చెల్లిస్తున్నారు.

ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పెత్తనం

సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలోని పలువురు అధికారులు, సిబ్బంది మూడేళ్లకుపైగా ఒకే సీట్లో తిష్ట వేశారు. సాధారణంగా రెండేళ్లకు బదిలీ చేయాల్సి ఉన్నప్పటికీ, అవేమీ తమకు వర్తించవన్నట్లు ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నారు. శానిటరీ వర్కర్ల పేరుతో నియమించబడిన కొంతమంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వివిధ సెక్షన్లలో కంప్యూటర్ ఆపరేటర్లుగా

మిగతా 8వ పేజీలో

పోలీసు వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్యాయత్నం


- 18 నెలలుగా తిరుగుతున్నా న్యాయం జరగలేదని సూసైడ్ నోట్
- సీఐపై చర్యలు తీసుకోవాలని కుటుంబసభ్యుల డిమాండ్



చికిత్స పొందుతున్న మేడిశెట్టి నవీన్

సిద్దిపేట క్రైం / సిద్దిపేట రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించిన ఓ వ్యక్తికి, సీఐ వేధింపులతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకున్నది. స్థానికులు, బాధితుడి వివరాల మేరకు.. సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల గ్రామానికి చెందిన మేడిశెట్టి నవీన్, మేడిశెట్టి శ్రావణ్ అన్నదమ్ములు. వీరు తమ సోదరితో కలిసి భాగస్వామ్యంలో ఒక హార్వెస్టర్‌ను కొనుగోలు చేశారు. హార్వెస్టర్ శ్రావణ్ పేరు మీద ఉన్నా, అతను ఈఎంఐలు సక్రమంగా చెల్లించకపోవడంతో ఫైనాన్స్ కంపెనీ నుంచి నవీన్‌కు ఫోన్లు వచ్చాయి. ఈ విషయమై ఇద్దరి మధ్య గొడవ జరగగా, పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. ఆ సమయంలో హార్వెస్టర్‌ను వేలం వేయగా నవీన్ దానిని కొనుగోలు చేసి, తర్వాత అమ్ముకున్నాడు. ఈ పరిణామాల మధ్య శ్రావణ్, నవీన్‌కు చెందిన ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడు. దీంతో నవీన్ సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేయడానికి నిరాకరించారు. శ్రావణ్‌కు కొందరు పెద్దమనుషుల అండ ఉండటంతో సీఐ నవీన్‌ను పట్టించుకోకుండా, అతనిపైనే ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. 18 నెలలుగా నవీన్ న్యాయం కోసం పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. శనివారం రోజున నవీన్ మరోసారి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా, సీఐ 'నీకు ఎన్నిసార్లు చెప్పినా అర్థం కాదు? పోలీస్‌స్టేషన్‌కు ఎన్నిసార్లు వస్తావు?' అంటూ తీవ్రంగా కొట్టడంతో నవీన్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం మధ్యాహ్నం తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి, సూసైడ్ నోట్ రాసి ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశాడు. ఆ తర్వాత పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు, వెంటనే 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నవీన్ పరిస్థితి విషమంగా ఉందిజ నవీన్ ఆత్మహత్యాయత్నానికి కారణమైన సీఐపై తక్షణమే చర్యలు తీసుకోవాలని నవీన్ కుటుంబసభ్యులు డిమాండ్ చేస్తున్నారు.





భక్తిపారవశ్యం

వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనం కోసం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. - వర్గల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి)

ఎంత మంది చస్తే కనువిప్పు కలుగుతుంది

- సీజనల్ వ్యాధులు వస్తాయని తెలిసినా చర్యలు ఎందుకు తీసుకోలే ?
- ఒక్క తిమ్మాపూర్‌లోనే 50 మంది మంచం పట్టారు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం

గజ్వేల్/ జగదేవ్‌పూర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సీజనల్ వ్యాధులతో ఇంకా ఎంతమంది చస్తే ప్రభుత్వానికి కనువిప్పు కలుగుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. సీఎం సచివాలయానికి రాడని.. గ్రామాలపై సమీక్షలు చేయడని, పారిశుధ్యంపై చొరవ చూపరని, చెత్తపాలనలో రాష్ట్రం అంతా చెత్త పేరుకుపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్లీచింగ్ పౌడర్ లేదని, ట్రాక్టర్లలో డీజిల్ లేక మూలకు పెట్టారని అన్నారు. జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్‌లో డెంగ్యూతో మృతిచెందిన శ్రావణ్, మహేశ్ కుటుంబాలను బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యంతోనే మహేశ్, శ్రావణ్ మృతిచెందారని, వారి మృతికి సర్కారే బాధ్యత వహించాలన్నారు. ఇలాంటి సమస్యలు వచ్చినప్పుడు సెక్రెటరీని సస్పెండ్ చేయడం కాదని, గ్రామపంచాయతీలకు నిధులు ఇవ్వాలన్నారు. ఏడాదిన్నరగా రూపాయి ఇవ్వలేదని మండిపడ్డారు. గతంలో తమ హయాంలో ప్రతీ నెల ఠంచన్‌గా గ్రామపంచాయతీల పారిశుధ్యానికి రూ.300కోట్లు ఇచ్చామన్నారు. మంత్రులు పనుల జాతరలో ఎస్కార్ట్ పెట్టుకుని తిరుగుతున్నారని, నేరుగా వస్తే గ్రామాల్లో జనాలు తంతారన్నారు. విషజ్వరాలతో పల్లెలు మంచం పట్టాయని, ప్రభుత్వం ఆసుపత్రులో వైద్య సేవలు అందించకపోవడం, మందులు అందుబాటులో పెట్టకపోవడంతో బాధిత కుటుంబాలు అప్పులపాలవుతున్నాయన్నారు. ఒక్క తిమ్మాపూర్‌లోనే 50మంది ఆసుపత్రి పాలయ్యారని, ప్రైవేటు ఆసుపత్రిలో చేరి వేలలో ఖర్చు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక యూరియా దొరికితే తులం బంగారం దొరికినట్లుగా రైతులు భావిస్తున్నరని, ఉదయం నుంచే ప్యాక్స్ వద్ద, ఫర్టిలైజర్ల దుకాణాల వద్ద యూరియా కోసం క్యూలైన్లు కడుతున్నారన్నారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో గజ్వేల్‌లో రేక్ పాయింట్ తెరచి బఫర్‌స్టాక్ పెట్టామని, ఈ ప్రభుత్వం కనీస స్టాక్‌ను పెట్టలేకపోయిందని మండిపడ్డారు. సీఎం ఇంటలిజెన్స్ ఏం చేస్తుందని, గ్రామాల్లో ప్రజలకు వస్తున్న విషజ్వరాలు, రైతులు యూరియా కోసం పడుతున్న కష్టాలు తెలియట్లేదా అని ప్రశ్నించారు. ఆయనవెంట పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, నాయకులు దేవిరవీందర్, ఎం.శ్రీనివాస్, నర్సింగరావు, ఆలేటి సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎక్బాల్, సుమన్, యాదగిరి, పాల రమేశ్‌గౌడ్, కిరణ్‌గౌడ్, భూమయ్య తదితరులున్నారు.



తిమ్మాపూర్‌లో డెంగ్యూతో మృతిచెందిన శ్రావణ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ప్రతాప్‌రెడ్డి



డెంగ్యూతో మృతిచెందిన యువకుడి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

తిమ్మాపూర్‌లో పారిశుధ్య చర్యలు చేపట్టాలి : కలెక్టర్

జగదేవ్‌పూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : తిమ్మాపూర్‌లో పారిశుధ్య చర్యలు వేగవంతం చేయాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. ఆదివారం జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్ గ్రామాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి జ్వర లక్షణాలు ఉన్న రక్తపరీక్షలను నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. గ్రామంలోని ఆర్ఎంపీ రమేష్ క్లినిక్‌ను సీజ్ చేయాలని, అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని హెచ్‌వోను ఆదేశించారు. డెంగ్యూ బారిన పడి మృతిచెందిన శ్రావణ్, మహేష్ కుటుంబసభ్యులకు ఎలాంటి జ్వర లక్షణాలు ఉంటే, వారిని ఆసుపత్రిలో చేర్పించి వైద్యం అందించాలని సూచించారు. డెంగ్యూతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తిమ్మాపూర్ గ్రామస్థులను మానిటరింగ్ చేయాలని, వారి కుటుంబసభ్యులకు పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారులకు తెలిపారు. పంచాయతీ అధికారులు పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డ్రైనేజీలను క్లీన్ చేయాలని, బ్లీచింగ్ చేయాలని ఆదేశించారు. తిమ్మాపూర్‌లో 24 గంటల పాటు వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆమె వెంట డీపీవో దేవకీదేవి, జిల్లా మెడికల్ వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్, ఎంపీడీవో రాంరెడ్డి, ఆర్ఐ ఫహద్ ఉన్నారు.

కొంచెం ఇష్టం కష్టం

ఇందిరమ్మ ఇళ్లు వేగవంతం

- దశలవారీగా బిల్లుల మంజూరు
- పలుచోట్ల ప్రారంభానికి సిద్ధం



జగదేవ్‌పూర్ మండలం లింగారెడ్డిపల్లిలో పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లు

గజ్వేల్/గజ్వేల్ జోన్ బృందం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొంచెం ఇష్టం.. కొంచెం కష్టంగా కొనసాగుతున్నాయి. గజ్వేల్ నియోజకవర్గ వ్యాప్తంగా 3 వేల ఇళ్లను మంజూరు చేయగా, మొదటగా ఆయా మండలాల్లోని ఒక్కో గ్రామంలో దాదాపుగా 639 ఇళ్ల పనులను మొదలు పెట్టారు. రెండో దశలో 2,299 వేల ఇళ్లను మంజూరు చేయగా, చాలా మంది నిర్మాణానికి ఆసక్తిని కనబరచలేదు. పలువురు ఇళ్లను ప్రారంభించి శరవేగంగా పనులను చేపడుతుండగా, ప్రభుత్వం దశలవారీగా బిల్లులను మంజూరు చేస్తున్నారు. మొదటి దశలో నిర్మాణం చేపట్టిన లబ్ధిదారుల ఇంటి నిర్మాణాలు దాదాపుగా పూర్తికావచ్చాయి. ప్రభుత్వ ఆదేశాలు రాగానే గృహప్రవేశాలు చేయాలన్న ఆలోచనలో ఉన్నారు. రెండో దశలో మంజూరైన ఇళ్లు బేస్మెంట్ లెవల్, రూఫ్ లెవల్ వరకు నిర్మాణాలు జరుగగా, మరికొందరివి స్లాబ్ లెవల్‌కు చేరుకున్నాయి. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణంపై ఆసక్తి కనబరుస్తుండగా, ప్రభుత్వం నుంచి డబ్బులు వస్తాయో.. రావో అన్న అనుమానం అనేక మందిలో ఉన్నాయి.



గజ్వేల్ మండలం బూర్గుపల్లిలో పునాదుల స్థాయిలో ఇందిరమ్మ ఇళ్లు

డివిజన్‌లో ఇళ్ల పరిస్థితి

గజ్వేల్ డివిజన్ పరిధిలో మొత్తం 3 వేల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేయగా, అందులో 1581 ఇళ్లకు మార్కవుట్ చేశారు. మిగిలిన 1419 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణంపై ఆసక్తి కనబరుచలేదు.

- గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ

మిగతా 8వ పేజీలో



మల్లన్న ఆలయానికి బోనాలతో తరలివస్తున్న భక్తులు

మల్లన్న సన్నిధి భక్తజనసంద్రం

కొమురవెల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న ఆలయానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. కోనేరులో పుణ్యస్నానమాచరించి గంగిరేణి చెట్టువద్ద, ఆలయ ముఖ మండపంలో పంచరంగులతో పట్నాలు వేసి బోనాలు నివేదించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎల్లమ్మ, పోచమ్మ అమ్మవార్లను దర్శించుకుని ఒడిబియ్యం, పట్టువస్త్రాలు సమర్పించారు. బెల్లం, కల్లుశాక పోశారు. సుమారు 20 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయకార్యనిర్వహణధికారి అన్నపూర్ణ తెలిపారు.

ఈసారి వచ్చేదెవరో?

- మల్లన్న ఆలయానికి వరుసగా ఇన్‌చార్జి ఈవోలే దిక్కు
- నెలాఖరున ప్రస్తుత ఈవో అన్నపూర్ణ ఉద్యోగవిరమణ

కొమురవెల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న ఆలయం పూర్తిస్థాయి కార్యనిర్వహణాధికారి (ఈవో) లేక అభివృద్ధిలో వెనుకబడుతోంది. ఏటా సుమారు రూ.22 కోట్ల ఆదాయంతో గణనీయమైన ప్రాధాన్యమున్నప్పటికీ ఈ ఆలయానికి వరుసగా ఇన్‌చార్జి ఈవోలను నియమించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుత ఈవో అన్నపూర్ణ ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనుండటంతో, తదుపరి ఎవరు వస్తారనే చర్చ మొదలైంది.

కుంటుపడుతున్న ఆలయ అభివృద్ధి

మల్లన్న ఆలయం డిప్యూటీ కమిషనర్ స్థాయిది అయినప్పటికీ, ఇన్‌చార్జి ఈవోల నియామకం వల్ల అభివృద్ధి పనులు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. గతంలో పనిచేసిన టంకశాల వెంకటేష్, ఆలూరి బాలాజీ, రామాంజనేయులు, ప్రస్తుత ఈవో అన్నపూర్ణ అందరూ ఇన్‌చార్జిలే. వీరు తమ మాతృ కార్యాలయాల విధులు చూసుకుంటూ, కొమురవెల్లి ఆలయానికి వారానికి రెండు, మూడు రోజులు మాత్రమే సమయం కేటాయించగలుగుతున్నారు. దీనివల్ల అభివృద్ధి పనులు ఏళ్లుగా పెండింగ్‌లో ఉంటున్నాయి. పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో, కొందరు ఆలయ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అన్నపూర్ణ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆలయ నిర్వహణలో కొన్ని కీలక సంస్కరణలు తీసుకొచ్చారు. ఆలయ సిబ్బంది విధులపై దృష్టి సారించి పాలనలో కొంత పారదర్శకత తీసుకొచ్చారు. అయినప్పటికీ, ఇన్‌చార్జిగా ఆమె బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడంలో పరిమితులు ఉన్నాయి. ఆలయానికి పూర్తిస్థాయి ఈవోను నియమించడం ద్వారా అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, పాలనలో మరింత పారదర్శకత తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు. ప్రస్తుత ఈవో అన్నపూర్ణ పదవీకాలాన్ని పొడిగిస్తారా లేక కొత్త ఈవోను నియమిస్తారా అనేది వేచి చూడాలి. గతంలో ఇక్కడ ఈవోలుగా పనిచేసిన వారు, ప్రస్తుతం ఇతర ఆలయాల్లో పనిచేస్తున్న వారు మల్లన్న ఆలయ ఈవో పోస్ట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. స్వామి ఆశీస్సులు ఎవరికి దక్కుతాయో చూడాలి.

ఇసుక అక్రమ రవాణా లారీ సీజ్

పటాన్‌చెరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఫిల్టర్ ఇసుకను తరలిస్తున్న ఒక లారీని పటాన్‌చెరు పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. కంది మండలం బ్యాతోల్ గ్రామం నుంచి తక్కువ ధరకు ఫిల్టర్ ఇసుకను కొనుగోలు చేసి, పటాన్‌చెరు మండలం ముత్తంగి ఔటర్‌రింగ్ రోడ్ మీదుగా యాదాద్రి జిల్లాకు తరలిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున ముత్తంగి ఔటర్ వంతెన కింద ఆగి ఉన్న లారీని పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఏఎస్‌ఐ అక్బర్ ఖాన్ తనిఖీ చేశారు. డ్రైవర్ శేఖర్ వద్ద సరైన రసీదులు లేకపోవడంతో లారీని సీజ్ చేశారు. ఏఎస్‌ఐ అక్బర్ ఖాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం రావడం లేదని
యువకుడి ఆత్మహత్య


బాణాల రఘు(ఫైల్)

బెజ్జంకి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం రావడం లేదనే మనోవేదనతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మరణించాడు. స్థానికుల వివరా ప్రకారం.. బెజ్జంకి మండలం గుగ్గిళ్ల గ్రామానికి చెందిన బాణాల రఘు (22) పదో తరగతి పూర్తి చేసి 2024లో హైదరాబాద్‌లో ఐటీఐ పూర్తి చేశాడు. అప్పటి నుంచి ఉద్యోగాల కోసం తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో నిరాశకు గురయ్యాడు. ఈ నెల 21న తన వ్యవసాయ పొలం వద్ద గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఎల్లారెడ్డిపేటలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ రఘు ఆదివారం మృతి చెందాడు. రఘు తండ్రి స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సౌజన్య తెలిపారు.

మహిళ అదృశ్యం


చింతల కవిత(ఫైల్)

చిన్నశంకరంపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేట మండలం చందాపూర్ గ్రామంలో ఒక మహిళ అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ నారాయణగౌడ్ వెల్లడించిన వివరాల ప్రకారం... మనోహరాబాద్ మండలం పర్కిబండ గ్రామానికి చెందిన చింతల కవిత (45) ఈ నెల 21న చందాపూర్ గ్రామంలో ఉన్న తన చెల్లెలి ఇంటికి వచ్చింది. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో కవిత అన్న గణేష్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కవిత ఆచూకీ తెలిసిన వారు 8712657937 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

డంపింగ్‌యార్డ్‌తో తంటాలు

- బుస్సాపూర్ శివారులో ఏర్పాటు
- దుర్గంధంతో పరిసర గ్రామాల ప్రజలకు ఇబ్బందులు
- కలుషితమవుతున్న చెరువులు.. కుంటల నీరు

తొగుట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆ గ్రామాల ప్రజలు దుర్గంధం నడుమ జీవనం కొనసాగిస్తున్నారు. డంపింగ్‌యార్డ్ మీదుగా వచ్చే గాలులతో సతమతమవుతున్నారు. కలుషిత నీరు పొలాల్లోకి, చెరువులు.. కుంట్లోకి చేరి పశువులు, చేపలు మృత్యువాత పడుతున్నాయి. సిద్దిపేట మండలం బుస్సాపూర్ శివారులోని ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ (353)లోని 10 ఎకరాల్లో 2012లో చెత్త డంపింగ్‌యార్డును ఏర్పాటు చేశారు. అప్పట్లోనే తొగుట మండల ప్రజలు డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. చెత్త రీసైక్లింగ్ చేస్తామని, దీంతో ఎలాంటి ఇబ్బంది ఉండదని నమ్మబలికిన అధికారులు ఇక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేశారు. సిద్దిపేట మున్సిపాలిటీ పరిధి, పట్టణంలో సేకరించిన చెత్తను వాహనాల్లో తరలించి, ఇక్కడ డంప్ చేస్తున్నారు. ఆ తర్వాత చెత్త రీసైక్లింగ్ ప్లాంట్ ఏర్పాటు చేసి. బయోగ్యాస్.. బయో ఎరువుల తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ ప్లాంట్‌లో కొంత వరకే చెత్తను రీసైక్లింగ్ చేస్తూ మిగితా చెత్తను కాల్చి వేయడంతో దుర్వాసన వెదజల్లి శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయని సమీప గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. డంపింగ్ యార్డును తొగుట మండలం గుడికందుల రెవెన్యూ శివారు పరిధి సమీపంలో నిర్మించడంతో వర్ధరాజ్‌పల్లి, గోవర్ధనగిరి, గుడికందుల గ్రామాలతో పాటు బుస్సాపూర్ గ్రామ ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. డంపింగ్ యార్డు నుంచి వచ్చే రసాయనాలు కలుషితమై పంట భూములు విషతుల్యంగా మారడంతోపాటు పశువులు, మేకలు, గొర్రెలు మృత్యువాత పడుతున్నట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


బుస్సాపూర్ శివారులో ఏర్పాటుచేసిన చెత్త డంపింగ్‌యార్డు


వర్ధరాజ్‌పల్లి చెరువులో చనిపోయిన చేపలు

దమ్మాయిచెరువులో చేపలు మృతి

డంపింగ్ యార్డులో నుంచి వెదజల్లే రసాయనాల ద్వారా మండలంలోని వర్ధరాజ్‌పల్లి, గుడికందుల, గోవర్ధనగిరి గ్రామాల్లోని గుట్టకాడికుంట, దమ్మాయిచెరువు, కసాయికుంట, పిండెచెరువు, పెద్దచెరువులలోని నీరు కలుషితమవుతున్నాయి. ఇటీవల దమ్మాయిచెరువులో ఐదు క్వింటాళ్ల వరకు చేపలు చనిపోయాయి. దాంతో మత్స్యకారులు ఉపాధి కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంది.

పంట భూములు కలుషితం



డంపుయార్డ్ నుంచి వచ్చే రసాయనాల వల్ల మా పంట భూములు కలుషితమవుతున్నాయి. చెత్తకు నిప్పుపెట్టడం వల్ల వచ్చే పొగతో దుర్గంధం వెదజల్లి అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వం డంపింగ్ యార్డును ఇక్కడి నుంచి తరలించాలి.

\- వంగాల మహిపాల్‌రెడ్డి, రైతు, వర్ధరాజ్‌పల్లి

ఉపాధి కోల్పోతున్నాం



చెరువులే మాకు జీవనాధారం. దానిలో పెంచే చేపలతోనే మాకు ఉపాధి లభిస్తుంది. డంపుయార్డు నుంచి వచ్చే రసాయనాల వల్ల చెరువులు కలుషితమై చేపలు చనిపోతున్నాయి. దాంతో వేము ఉపాధి కోల్పోవాల్సి వస్తుంది. మాకు న్యాయం చేసి ఉపాధి కోల్పోకుండా చూడాలి.

\-ఉప్పరి స్వామి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు, వర్ధరాజ్‌పల్లి

ఏఐసీసీ ఇన్‌చార్జికి ఘన స్వాగతం


బెజ్జంకి క్రాసింగ్ వద్ద స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

బెజ్జంకి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో చేపట్టిన జనహిత పాదయాత్రకు వెళ్తున్న ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ నాయకులు బెజ్జంకి క్రాసింగ్ వద్ద ఘన స్వాగతం పలికారు. బెజ్జంకి క్రాసింగ్ వద్ద రాజీవ్ రహదారిపై వేచి ఉన్న నాయకులు, పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలు కప్పి వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, పోతిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, బైర సంతోష్, చెప్యాల శ్రీనివాస్‌గౌడ్, గూడెల్లి శ్రీకాంత్, ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీ బాలుడికి కడుపు వాపు



శివ్వంపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తాగునీటిలో ఎలుక పడి చనిపోయిన నీటిని అంగన్‌వాడీ చిన్నారులు తాగిన ఘటనలో ఒక బాలుడికి కడుపులో వాపు వచ్చిన సంఘటన ఆదివారం రత్నాపూర్ గ్రామంలో జరిగింది. మండల పరిధిలోని రత్నాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఎనిమిది మంది విద్యార్థులు ఎలుక పడిన నీటిని తాగారు. అందులో దొడ్లే ఋషివర్ధన్ (4) అనే బాలుడికి ఆదివారం కడుపు ఉబ్బి, వాపు వచ్చింది. వెంటనే కుటుంబసభ్యులు అతన్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన పరీక్షల కోసం బాలుడిని మెదక్‌కు తరలించినట్లు సమాచారం.






గణపతి పూజకు సిద్ధం

గణపతి పూజకు వేళయింది. రెండురోజుల్లో గణనాధుడు మండపాల్లో కొలువుదీరేందుకు రెడీ అవుతున్నాడు. ఇందుకోసం సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తా ప్రాంతాల్లో వినాయక విగ్రహాలు రెడీ అవుతున్నాయి. వివిధ ఆకారాల్లో తయారుచేసిన వినాయక విగ్రహాలు విక్రయానికి సిద్ధంగా ఉంచారు. కళాకారుల చేతుల్లో రూపుదిద్దుకున్న వినాయక విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి జిల్లా



గోమయ గణపయ్య



వినాయకచవితిని పురస్కరించుకుని సిద్దిపేటలోని ఎస్ఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోమయ గణపయ్యలను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఆవుపేడ, కలకత్తా మట్టి, చింత గింజల పొడితో పర్యావరణ హితంగా వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. వీటితో పాటు జ్యోతులు, ప్రమిదలు, ధూప్ స్టిక్‌లు, అమ్మవారి ప్రతిమలను కూడా ఉచితంగా అందిస్తామని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

విభిన్న రూపాయ.. విఘ్నేశ్వరాయ..

● మెదక్‌లో గణపతుల తయారీ ● చిన్నా.. పెద్ద విగ్రహాలు ఇక్కడే

మెదక్, కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వచ్చిందంటే చాలు చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా.. ఎలాంటి గణపతులు తీసుకురావాలి, ఎత్తు ఎంత ఉండాలి, అందరికంటే మన గణపతి భిన్నంగా ఉండాలి, మండపాల డెకరేషన్ అందంగా ఉండాలి ఇలా ముందు నుంచే ప్రణాళికలు వేస్తుంటారు. ఎవరి ఇష్టం మేరకు భారీ, విభిన్నమైన గణనాయకులను మండపాల్లో ప్రతిష్ఠించి, తొమ్మిది



వివిధ రూపాలలో తయారు చేసిన గణపతులు

రోజులపాటు భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారు. అయితే, జిల్లాలో ప్రతిష్ఠించేందుకు విభిన్న రూపాల విఘ్ననాయకుల విగ్రహాలు రూపుదిద్దుకుంటున్నాయి. భక్తి భావంతో విగ్రహాల తయారీలో కళాకారులు శ్రమిస్తున్నారు. ఇందులో కొన్ని అరచేతిలో పట్టేంత చిన్నవిగా ఉంటే.. మరి కొన్ని 21 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ఉంటాయి.

గతంలో గణపతుల విగ్రహాలను కొనుగోలు చేయాలంటే హైదరాబాద్‌లోని ధూల్‌పేటతోపాటు ఇతర ప్రాంతాలకు, కోరుట్ల లాంటి ప్రాంతాలకు వెళ్లేవారు. అయితే, ఇప్పుడు మెదక్ జిల్లా కేంద్రంలోని అవుసులపల్లి పరిధిలోని శిల్పా కళా ఆర్ట్ ఆధ్వర్యంలో అరచేతిలో పట్టే సైజ్ నుంచి నుంచి 21 అడుగుల వరకు గణపతులు తయారు చేసి ఇస్తున్నారు. మండప నిర్వాహకుల అభిరుచికి అనుగుణంగా, విభిన్న రకాలుగా వినాయక విగ్రహాలను తీర్చిదిద్దుతున్నారు. దీంతో జిల్లావ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి మండప నిర్వాహకులు, సభ్యులు వచ్చి గణేష్ ప్రతిమలు కొనుగోలు చేస్తున్నారు. మండప నిర్వాహకులు విగ్రహాలు కొనేందుకు రావడంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది.



అడుగుల గణపతి

తక్కువ ధరకే అందిస్తున్నాం: లక్ష్మణ్‌చారి



సుదూర ప్రాంతాలకు వెళ్లి గణపతులు తెచ్చుకోవడం కంటే మా దగ్గర అన్ని రకాల మోడల్స్ గణపతులు తయారు చేస్తున్నాం. ఇతర దుకాణాలతో పోలిస్తే మా శిల్పాకళా ఆర్ట్స్ వద్ద తక్కువ ధరల్లో వినాయక ప్రతిమలు అందిస్తున్నాం. ఇక్కడే తయారు చేయడం వల్ల తక్కువ ధరకు అందించడం సాధ్యమవుతుంది.

మట్టి వినాయకుడిని పూజిస్తే భక్తి

● మట్టి వినాయకుల పంపిణీలో హరీశ్‌రావు



మట్టి వినాయక ప్రతిమ పంపిణీ కార్యక్రమంలో హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మట్టి వినాయకులను పూజిస్తే భక్తి, ముక్తి కలుగుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలోని వేంకటేశ్వర ఆలయం వద్ద అమర్‌నాథ్ అన్నదాన సేవాసమితి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి సేవలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని కితాబిచ్చారు. మట్టితో చేసిన వినాయకుడిని పూజిస్తే మనకు భక్తి ముక్తి లభిస్తుందన్నారు. గతంలో గ్రామాల్లో కుల మతాలకతీతంగా ఐక్యంగా ఉండేందుకు ఒక్క వినాయకుడినే పెట్టి పూజించేవారని గుర్తుచేశారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వల్ల జల కాలుష్యం జరుగుతుందన్నారు. సిద్దిపేట పట్టణంలో తాను మొక్కలను నాటితే కొందరు నరుకుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి శాశ్వత భవన నిర్మాణాన్ని త్వరలోనే ప్రారంభం చేసుకుందామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం

● ఎమ్మెల్యే సునీతారెడ్డి
● యూరియా కోసం రహదారిపై ధర్నా

శివ్వంపేట/సిద్దిపేట రూరల్/నంగునూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. రైతులకు సరిపడా యూరియాను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ శివ్వంపేట పీఏసీఎస్ కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు మొదటగా యూరియా కొరత లేదని చెప్పినప్పటికీ.. ప్రస్తుతం పొలాల్లో కలుపుతీసే సమయంలో యూరియా కొరతతో రైతులు అవస్థలు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా, పార్టీ మండల అధ్యక్షుడు రమణగౌడ్ తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ చౌరస్తాలో యూరియా కోసం రైతులు సిద్దిపేట-ముస్తాబాద్ రోడ్డుపై ఆదివారం రాస్తారోకో చేశారు. సరైన సమయానికి పంటకు యూరియా అందించకపోతే పంట దిగుబడి ఎలా వస్తుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామంలో యూరియా సరఫరా



యూరియా కొరతను నిరసిస్తూ శివ్వంపేటలో ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

చేసినా ఒక్క బస్తా దొరకడం లేదని వాపోతున్నారు. విషయం తెలుసుకున్న వ్యవసాయ అధికారి నరేష్, రూరల్ సీఐ శ్రీను, ఎస్ఐ రాజేష్ రైతులకు సర్ది చెప్పి రాస్తారోకో విరమింపజేశారు. అలాగే నంగునూరు మండలంలోని పాలమాకుల, రాంపూర్, మగ్ధుంపూర్, ముండ్రాయి, ఓబులాపూర్, బద్దిపడగ,



సిద్దిపేట-ముస్తాబాద్ రోడ్డుపై రాఘవాపూర్ వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు

నర్మెట్ట, వెంకటాపూర్ తదితర గ్రామాల రైతులు యూరియా కోసం బారులు తీరారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతువేదిక వద్ద టోకెన్లు ఇస్తే, సహకార సంఘం వద్ద యూరియా బస్తాలు అందజేశారు. పాలమాకుల గ్రామంలో పోలీస్ పహారాలో అధికారులు యూరియా పంపిణీ చేశారు.

స్థానిక పోరులో మనమే గెలవాలి

● శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి

రామాయంపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక పోరులో బీఆర్ఎస్ గెలువాలని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసుధనాచారి అన్నారు. ఆదివారం ఆయన నిజామాబాద్ వెళ్తున్న సమయంలో రామాయంపేట బైపాస్ రోడ్డు వద్ద కొద్దిసేపు ఆగారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు అక్కడికి చేరుకొని మధుసూదనాచారిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘనవిజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నామరూపాలు లేకుండా పోతుందన్నారు. కార్యకర్తలు ఎన్నికలకు సమాయత్తం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, హుస్నుద్దీన్ రాజు, యాదగిరి, ఆమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

20 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

సిదిపేట కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా కేంద్రంలోని టీటీసీ భవన్‌లో తొగుట మండలం గుడికందుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004-05 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20 ఏళ్ల తర్వాత కలవడంతో అప్పటి స్మృతులను గుర్తు చేసుకుని మురిసిపోయారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందించాలి

● ప్రొఫెసర్ కోదండరాం
● అన్నివర్గాలను చైతన్య పరిచేది ఉపాధ్యాయుడే: ప్రొఫెసర్ కాశీం
● విద్యతోనే సమసమాజ అభివృద్ధి : విమలక్క

గజ్వేల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధనను అందించాలని జేఏసీ చైర్మన్, ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఓ ప్రైవేటు గార్డెన్స్‌లో ఉపాధ్యాయుడు పంబాల ఎల్లయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యాసదస్సులో ఆయన మాట్లాడారు. సమాజంలో ఉపాధ్యాయులంతా బాధ్యతతో నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన బోధనను అందించాలని కోరారు. ప్రభుత్వాలు సైతం అంతే బాధ్యతగా పాఠశాల విద్య బలోపేతానికి నిధులను సమకూర్చాలన్నారు. టీపీటీఎఫ్ కార్యకర్తలంతా ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. అనంతరం డాక్టర్ అనిత మాట్లాడుతూ మహిళలు ఉద్యమకాలంలో రచయితలుగా రాణించారన్నారు. ప్రొఫెసర్ చింతకింది కాశీం మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఉపాధ్యాయుడు కొన్ని విలువలు కలిగి ఉండాలని, ఉపాధ్యాయులు మాత్రమే సమాజంలోని అన్నివర్గాలను





విద్యాసదస్సులో మాట్లాడుతున్న కోదండరాం, విమలక్క

చైతన్యపరుచగలరని తెలిపారు. సీబీఎస్సీ, ఐసీఎస్సీ పాఠ్యాంశాల మాదిరిగా తెలంగాణ పాఠ్యాంశాలను రూపొందించాలని చెప్పారు. ప్రస్తుత సమాజంలో విద్య పూర్తిగా ప్రైవేటీకరణ దిశగా సాగుతుందన్నారు. సమాజంలోని పేద విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమై కూలీలుగా, చిన్న చిన్న పనులు చేసుకుంటూ దుర్భరమైన జీవితం గడుపుతున్నారని, దీంతో సమాజంలో రోజురోజుకు పేదవారి సంఖ్య పెరిగిపోతూ.. వారి జీవితాలు దుర్భరంగా మారుతున్నాయని చెప్పారు. విద్యతోనే సమసమాజ అభివృద్ధి జరుగుతుందని, ఉపాధ్యాయులు విద్యతో పాటు విలువలను, ప్రశ్నించేతత్వాన్ని విద్యార్థులకు, సమాజానికి నేర్పాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క అన్నారు. ఈ సదస్సులో టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నబోయిన తిరుపతి, టీపీటీఎఫ్ అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు లక్ష్మయ్యయాదవ్, దామోర రాజయ్య, రాంచంద్రం, రాజులు, పాపిరెడ్డి, మంజుల, నేతి శంకర్, నర్సింలు, మహేందర్ గౌడ్, ఆయా మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

అధికారపక్షం ఇవ్వదు.. ప్రతిపక్షం నోరెత్తదు

● రేవంత్‌రెడ్డితో తాడో పేడో తేల్చుకుందాం
● తమ ఉద్యమం అధికారపక్షానికి ఉరితాడుగా మారబోతుంది
● ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణమాదిగ

జహీరాబాద్/జోగిపేట రూరల్/నర్సాపూర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షాల అసమర్థత వల్లే అధికార పక్షం ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని, అధికార పక్షం ఇవ్వదు.. ప్రతిపక్షం నోరెత్తదు అని ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, నర్సాపూర్, అందోల్‌లలో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో నేడు పేదలు సమస్యల్లో కూరుకుపోయారన్నారు. నాటి వైఎస్ నుంచి నేటి రేవంత్ రెడ్డి వరకు తాము నిరుపేదల కోసం పోరాటాలు.. ఉద్యమాలు చేసి అండగా నిలుస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో హామీలు అమలవుతుంటే తెలంగాణలో ఎందుకు అమలుకావడం లేదని ఆయన ప్రశ్నించారు. ఎమ్మార్పీఎస్ ఏనాడు కులం కోసం పోరాటాలు చేయలేదని మాదిగల రిజర్వేషన్ల కోసం పోరాటం చేసిందన్నారు. సమస్యల సాధన కోసం తాము చేపట్టే ఉద్యమం అధికారపక్షానికి ఉరితాడుగా మారబోతుందని, సీఎం రేవంత్‌రెడ్డితో తాడో,పేడో తేల్చుకుందామని మందకృష్ణ స్పష్టం చేశారు. వృద్ధులు, దివ్యాంగుల పెన్షన్లు, పెన్షన్ల పెంపు విషయంలో ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తుందన్నారు.

శ్రమను గౌరవిస్తేనే దేశాభివృద్ధి : రాఘవులు

పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శ్రమను గౌరవించే సంస్కృతి ఉన్న దేశాలు మాత్రమే అభివృద్ధి సాధ్యమవుతుందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ 40వ వార్షికోత్సవ కార్యక్రమాల ముగింపు సందర్భంగా ఆదివారం జరిగిన కార్మిక కుటుంబాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ ప్రైవేట్ పరిశ్రమలో ఒకే నాయకత్వంలో 40 ఏళ్లపాటు యూనియన్‌ను నడిపించడం అభినందనీయమన్నారు. కేవలం తమ జీతభత్యాల కోసమే కాకుండా సామాజిక కార్యక్రమాలలో సైతం చురుకుగా పాల్గొంటూ ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలిచిందని అభినందించారు. దేశ జనాభాలో 50 శాతంగా ఉన్న మహిళలు ఉత్పత్తిలో భాగస్వాములైతేనే నిజమైన అభివృద్ధి సాధించినట్లు అవుతుందన్నారు. అంతర్జాతీయ పరిస్థితులు గమనిస్తే ముఖ్యంగా అమెరికా ట్రంప్ ప్రభుత్వం ఇటీవల అడ్డగోలుగా పెంచిన పన్ను టారీఫ్ ద్వారా ఎగుమతులపై ఆధారపడిన పరిశ్రమలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ఇలాంటి పరిస్థితులలో ఉన్న సౌకర్యాలను నిలబెట్టుకోవడమే కష్టమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులపై వైన్స్ యజమానుల దౌర్జన్యం

- సిండికేట్‌గా మారి హుకూంలు జారీ
- ఎమ్మార్పీ కంటే ఒక్కొక్క క్వాటర్ బాటిల్‌పై రూ.15 వసూలు
- సెల్‌ఫోన్ కెమెరాలతో వీడియోలు తీస్తూ బెదిరింపులు

అక్కన్నపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండలంలో ఉన్న మూడు మద్యం షాపులను సిండికేట్‌గా ఏర్పాటు చేసిన యాజమాన్యం కొత్త తరహా దందాకు తెరలేపుతున్నారు. గ్రామాల్లోని బెల్ట్‌షాపులకు ఎమ్మార్పీ ధర కంటే ఒక్కొక్క క్వాటర్ బాటిల్‌కు రూ.15 అదనంగా అమ్ముతున్నారు. వారి వద్ద కొనుగోలు చేసిన బాటిళ్లకు స్టిక్కర్లు వేసి ఇస్తున్నారు. పలు గ్రామాల్లోని బెల్ట్‌షాప్ నిర్వాహకులకు మద్యాన్ని తామే ద్విచక్ర వాహనాల ద్వారా పంపిణీ చేస్తూ మేము స్టిక్కర్లు వేసి ఇచ్చిన మద్యం బాటిళ్లను మాత్రమే అమ్మాలంటూ ఆదేశిస్తున్నారు.

ప్రైవేట్ వ్యక్తులతో దౌర్జన్యం

గ్రామాల్లో ఎవరైనా మద్యం అమ్మాలంటే వైన్‌షాప్ యాజమాన్యం పర్మిషన్ తీసుకుని వారు ఇచ్చిన మద్యం సీసాలను మాత్రమే అమ్మాలని హుకుం జారీచేస్తున్నారు. ఎవరైనా వేరే మండలంలోని వైన్‌షాప్‌ల నుంచి మద్యం తీసుకొచ్చి అమ్ముతారని బెల్టుషాపుల్లో ప్రైవేట్ వ్యక్తులతో తనిఖీలు నిర్వహిస్తున్నారు. బెల్టుషాపులకు తనిఖీలకు వెళ్లిన ప్రైవేట్ వ్యక్తులు సెల్‌లో వీడియోలు తీస్తూ, ఇంట్లో మహిళలు ఉన్నారని చూడకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. స్టిక్కర్ లేని మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని బెల్ట్‌షాపు నిర్వాహకులపై దుర్భాషలాడుతున్నారు. బెల్టుషాప్ నిర్వాహకులు ఎవరైనా తిరగబడితే ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇచ్చి, కేసులు నమోదు చేయిస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్‌శాఖ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరించడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్‌శాఖ అధికారులు స్పందించి బెల్టుషాపులపైన దౌర్జన్యానికి పాల్పడుతున్న ప్రైవేట్ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



బీరు బాటిల్‌పై స్టిక్కర్ వేసిన దృశ్యం

మృతుల కుటుంబాలకు 'చామల' పరామర్శ

చేర్యాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సతీవియోగం చెందిన కొమురవెల్లి మల్లన్న ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ముస్త్యాల కిష్టయ్యతో పాటు సోదరవియోగం చెందిన జేఏసీ చైర్మన్ రామగల్ల పరమేశ్వర్, మృతుడి కుటుంబసభ్యులను ఆదివారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, మాజీ జడ్పీటీసీలు కొమ్ము నర్సింగరావు, గిరి కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొమ్ము రవి, మల్లన్న ఆలయ మాజీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ముస్త్యాల కిష్టయ్య కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న భువనగిరి ఎంపీ చామల

నేడు చలో దుద్దెడ

- జేఏసీ ఆధ్వర్యంలో రాజీవ్ జాతీయ రహదారి ముట్టడి
- భారీగా తరలిరావాలని పిలుపు

చేర్యాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో నేడు రాజీవ్ జాతీయ రహదారి ముట్టడించనున్నారు. ఈ మేరకు దుద్దెడ క్రాస్‌రోడ్డు వద్ద ఆందోళన చేపట్టేందుకు ఇటీవల పిలుపునిచ్చిన జేఏసీ నాయకులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు సమావేశమై పార్టీ శ్రేణులు, జన సమీకరణపై చర్చించారు. రెండురోజులక్రితం జేఏసీ భాగస్వాములతో సమావేశమయ్యారు. రెవెన్యూ డివిజన్ విషయంలో ప్రభుత్వం తాత్సారం వహిస్తుండటం తగదని దశలవారీగా ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఈ నేప థ్యంలో ప్రభుత్వంలో చలనం తీసుకురావాలని రాజీవ్ రహదారి ముట్టడి చేపట్టారు. పోలీసులు ముందస్తు అరెస్టులు చేస్తే ఏం చేయాలన్న అంశంపై చర్చించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆందోళన చేపట్టాలన్న నిర్ణయం మేరకు పలువురు పట్టణం వీడి పొరుగు ప్రాంతాలకు వెళ్లారు. ఆయా పరిణామాల నేపథ్యంలో నేటి చలో దుద్దెడ పట్ల ఉత్కంఠ నెలకొనడం ఆసక్తికరంగా మారింది.



సమావేశమై చర్చిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మార్పీఎస్ మహాగర్జన సభను విజయవంతం చేయాలి

- సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి మందకుమార్

మిరుదొడ్డి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : సెప్టెంబరు 9న సికింద్రాబాద్‌లో జరిగే వికలాంగుల చేయూత పెన్షన్‌దారుల మహాగర్జనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి మందకుమార్, జిల్లా అధ్యక్షుడు ముక్కపల్లి రాజు మాదిగ అన్నారు. ఆదివారం మిరుదొడ్డిలో వికలాంగులతో కలిసి వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మానిఫెస్టోలో వికలాంగులకు ఇచ్చిన హామీ ప్రకారం 6వేల , వృద్దులకు 4వేల రూపాయల పెన్షన్‌ను అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం వికలాంగుల మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్లారెడ్డి, ఉపాధ్యక్షుడిగా జగ్గారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జేష్, కార్యదర్శిగా రాజు, కార్యకర్గ సభ్యులుగా రాజులను ఎన్నుకున్నారు. సెప్టెంబరు 9న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన చలో పరేడ్ గ్రౌండ్స్ మహాగర్జన సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి మందకుమార్ పిలుపునిచ్చారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని క్యాసారంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి, చేయూత పెన్షన్‌దారుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చినహామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట నాయకులు కప్పు యాదగిరి, వంటేరు చంద్రారెడ్డి, వడ్యారం యాదమ్మ, కుమ్మరి లక్ష్మి, నర్సవ్వ తదితరులున్నారు.



మిరుదొడ్డిలో దివ్యాంగులతో కలిసి మాట్లాడుతున్న మందకుమార్ మాదిగ

స్వామి వివేకానంద బోధనలు ఆచరణీయం

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : జీవితంలో ఎదురయ్యే సమస్యలను, సవాళ్లను ఎదుర్కోవడానికి భక్తి మార్గాన్ని అనుసరించాలని శ్రీరామకృష్ణ మఠం స్వామి తత్వదానందజీమహరాజ్ సూచించారు. సిద్దిపేటలోని వివేకానందకాలనీలో శ్రీరామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన సత్సంగం ఆధ్యాత్మికలో స్వామిజీ పాల్గొని మాట్లాడారు. స్వామి వివేకానంద బోధనలను ఆచరించి సమాజానికి సేవ చేయడం ద్వారా శాంతిని పొందవచ్చని పేర్కొన్నారు. రామకృష్ణ మఠం ప్రతినిధి సూర్యప్రకాష్ మాట్లాడుతూ జీవితంలో అన్ని సమస్యల పరిష్కారానికి వ్యక్తిశీల నిర్మాణం, ఆధ్యాత్మికతలే మార్గమని అన్నారు. ప్రతి ఒక్కరు స్వామి వివేకానంద, రామకృష్ణ పరమహంస, శారదా దేవి జీవితం, బోధలు తెలుసుకోవాలని సూచించారు. శ్రీరామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు ఇల్లందుల నాగేందర్, సేవా సమితి కార్యదర్శి రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ సేవాసమితి నిర్వహించే కార్యక్రమాలను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి రామకృష్ణ మఠం భక్తులు, అన్నపూర్ణేశ్వరి ఆలయ భక్తులు దాదాపు 80 మంది హాజరయ్యారు.

ధ్యానాన్ని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి : యాదవరెడ్డి



కోమటిబండలో హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న యాదవరెడ్డి

గజ్వేల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ధ్యానాన్ని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని శాసనమండలి సభ్యుడు డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. గజ్వేల్ మండల పరిధిలోని కోమటిబండ గ్రామంలోని శ్రీకృష్ణ ధ్యాన కేంద్రంలో రూ.1.50 లక్షల ఎమ్మెల్సీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ధ్యానం మానసికంగా ఆరోగ్యంగా ఉంచేందుకు దోహదపడుతుందన్నారు. ఆయనవెంట ఆపన్న హస్తమిత్ర బృందం అధ్యక్షులు బాల్‌చంద్రం, సుభాష్‌రెడ్డి, పీఎస్ఎస్ఎం అధ్యక్షుడు నర్సింలు, రమేశ్ తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ దైవారాధన అలవర్చుకోవాలి

గజ్వేల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ దైవారాధనను అలవర్చుకోవాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్ నుంచి శబరిమలకు మహాపాదయాత్రగా వెళ్తున్న అయ్యప్పస్వామి మాలాధారణ భక్తులకు ఆయన స్వాగతం పలికి, అన్నప్రసాద వితరణ చేశారు. పాదయాత్ర చేస్తున్న గురుస్వామి రాజును సన్మానించారు. ఆయనవెంట అయ్యప్ప ఆలయ సభ్యులు ఎర్రం శ్రీనివాస్, జగ్గయ్యగారి శేఖర్‌గుప్తా ఉన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా ప్రభాకర్‌రావు

హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీని పుర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, వివిధ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఎన్నుకున్నారు. చైర్మన్‌గా పట్టణానికి చెందిన మంతెన ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా వరియోగుల మురళీధర్‌స్వామిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆలయ అభివృద్ధి కోసం ఐక్యంగా పని చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, గాదెపాక రవీందర్ తదితరులున్నారు.

'సిరి' షార్ట్ ఫిలిం అమ్మాయిలకు మంచి సందేశం



సిరి షార్ట్ ఫిలింను విడుదల చేస్తున్న దృశ్యం

దౌల్తాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : నేటి సమాజంలో అమ్మాయిలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు తదితర సంఘటనల ఆత్మరక్షణకు సిరి అనే షార్ట్ ఫిలిం ద్వారా మంచి సందేశం దొరుకుతుందని ఫిలిం దర్శకుడు, సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్‌కు చెందిన అల్వాల రాజు అన్నారు. ఆదివారం లఘు చిత్రాన్ని విడుదల చేసి మాట్లాడారు. సిరి చిత్రం ద్వారా మహిళలకు, బాలికలకు, వారి కుటుంబాలకు ఆత్మస్థైర్యం కలుగుతుందని తెలిపారు. చిన్న వయసులో నాకు దర్శకుడిగా అవకాశం దొరకడం ఎంతో గర్వకారణంగా ఉందని తెలిపారు. సిరి చిత్రాన్ని రూపొందించడానికి సహకరించిన మిత్రులకు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలిపారు.

మట్టి గణపతులను ప్రతిష్ఠించాలి



మట్టి వినాయక విగ్రహాలు, మొక్కలను పంపిణీ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణాన్ని పరిరక్షించేందు ప్రతి ఒక్కరూ ఒక మొక్కనాటి... మట్టి గణపతుల పూజించాలని జీ5 టౌన్‌షిప్ ఆధ్వర్యంలో ఆదివారం హుస్నాబాద్‌లో వినూతనంగా ప్రచారం చేపట్టారు. పందిల్ల, హుస్నాబాద్‌లో 1,600 మట్టి గణపతి విగ్రహాలను, 1,600 మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డి అజయ్, సంపత్ పాల్గొన్నారు.

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

బెజ్జంకి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మండలంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్ఐ సౌజన్య ఒక ప్రకటనలు తెలిపారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాలను సారం మాదకద్రవ్యాల నిర్మూలన, వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

సురవరం సుధాకర్‌రెడ్డి సేవలు మరువలేనివి



సుధాకర్‌రెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



సిద్దిపేట అర్బన్ : సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

గజ్వేల్/అక్కన్నపేట/చేర్యాల/సిద్దిపేట అర్బన్/బెజ్జంకి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సురవరం సుధాకర్‌రెడ్డి సేవలు మరువలేనివని పలువురు పేర్కొన్నారు. సుధాకర్‌రెడ్డి మృతిపట్ల జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని మక్దూంభవన్‌లో సురవరం భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిద్దిపేటలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ ఆధ్వర్యంలో సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టాపురం లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు. గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి సీపీఐ నాయకులు స్వర్గం రాజేశం పూలమాలవేసి నివాళులర్పించారు. అక్కన్నపేట మండల కేంద్రంలో సీపీఐ మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్ ఆధ్వర్యంలో సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బెజ్జంకి మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి సీపీఐ నాయకులు ఆదివారం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోతిరెడ్డి వెంకటరెడ్డి, మండల కార్యదర్శి రూపేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మధు నాయకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొమురవెల్లి ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ముస్త్యాల 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా కొమురవెల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని కొమురవెల్లి, గౌరాయపల్లి, కిష్టంపేట,రాంసాగర్, ఐనాపూర్ గ్రామాల్లో నేడు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రైతులు సహకరించాలని ఏఈ మధు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

●ములుగు: ములుగు మండలం వంటిమామిడి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల ఇండస్ట్రియల్ చిన్నతిమ్మాపూర్‌లోని ఏజీఎల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి 12 గంటల వరకు వంటిమామిడిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

●మద్దూరు : ముస్త్యాల 132కేవీ సబ్‌స్టేషన్‌లో 33కేవీ ఎక్స్‌టెన్షన్ వర్క్ చేపట్టనుండడంతో ధూళిమిట్ట మండలంలోని ధూళిమిట్ట, బెక్కల్, బైరాన్‌పల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో నేడు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఏఈ తెలిపారు.

రైతు సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

నంగునూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య అన్నారు. ఆదివారం నంగునూరు మండలం పాలమాకులలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యూరియా పంపిణీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. తెల్లవారుజాముకు ముందే రైతులు క్యూ లైన్ లో నిలబడి తీవ్ర ఇబ్బందులకు పడుతున్నారని చేశారు. ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి రైతులకు సరిపడే యూరియాను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ వర్దోలు వేణుచక్రవర్తి, బీఆర్ఎస్ నాయకులు వేల్పుల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఉసురు తగులుతుంది

మిరుదొడ్డి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : దేశానికి అన్నం పెట్టే రైతన్నల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగులుతుందని మిరుదొడ్డి మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు పోలీస్‌రాజు, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు మండిపడ్డారు. ఆదివారం మిరుదొడ్డిలో బీఆర్ఎస్ నాయకులతో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు యూరియా కొరత లేకుండా చూశామని గుర్తుచేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు తోట కమలాకర్‌రెడ్డి, అంజిరెడ్డి, భైరయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై ఏసీపీ విచారణ

గజ్వేల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై గజ్వేల్ ఏసీపీ కోణం నర్సింలు విచారణ చేపట్టారు. గజ్వేల్ మండలం సింగాటంలో నమోదైన కేసు విషయంలో ఆదివారం విచారణ జరిపిన ఆయన బాధితులను, సాక్ష్యులను ఆయన విచారణ చేసి, రిపోర్టును సేకరించారు. ఆయనవెంట ఎస్ఐ రఘుపతి, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

పోలీసులను పెట్టి యూరియా అమ్మకాలు సిగ్గుచేటు

కొమురవెల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అగ్రోస్ రైతుసేవా కేంద్రం దగ్గర పోలీసులను పెట్టి రైతులకు యూరియా అమ్మకాలు జరపడం సిగ్గుచేటని సీపీఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్ విమర్శించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పోలీస్ పహారాలో రైతులకు యూరియా అమ్మకాలు చేయడమంటే రైతులను అగౌరవపరచినట్టే నన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తేలు ఇస్తారి, కర్రోళ్ల ఎల్లయ్య పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

నంగునూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందిన సంఘటన నంగునూరులో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పప్పు రాజిరెడ్డి గేదె తన వ్యవసాయ బావి వద్ద గడ్డి మేస్తున్నది. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఉన్న వైర్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.లక్ష ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ కమిటీ ఎన్నిక

చేర్యాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శి ఎన్నిక ఆదివారం స్థానిక మహామ్మాయి ఆలయ ఆవరణలో జరిగింది. అధ్యక్షుడిగా మేర్గోజు సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడిగా రాళ్లబండి నాగరాజు, కార్యదర్శిగా రాళ్లబండి భాస్కర్, కోశాధికారిగా కాసుల భాస్కర్, ఉపాధ్యక్షులుగా మేర్గోజు రామచంద్రం, ఎర్రోజు వెంకటేశం, తాటికొండ శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా మేర్గోజు కిరణ్, కాసులకుమార్, రాళ్లబండి చందు ఎన్నికయ్యారు.

కమీషన్ కొట్టు.. బిల్లు పట్టు

(5వ పేజీ తరువాయి)

పనిచేస్తూ, రెగ్యులర్ ఉద్యోగులను కూడా శాసిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనివల్ల రెగ్యులర్ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి.

ఉన్నతాధికారుల మౌనం

మున్సిపల్ కార్యాలయంలో ఈ అవకతవకలు జరుగుతున్నా, ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని సిబ్బందే గుసగుసలాడుకుంటున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో కొందరు ఉద్యోగులు అక్రమాలకు పాల్పడుతున్నారని, దీంతో దేశ స్థాయిలో బ్రాండ్ ఇమేజ్ సాధించిన సిద్దిపేట మున్సిపాలిటీకి అప్రతిష్ఠ వస్తోందని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి, అవినీతికి పాల్పడుతున్న ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారిని బదిలీ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కొంచెం ఇష్టం.. కొంచెం కష్టం

(5వ పేజీ తరువాయి)

పరిధిలో 147మందికి ఇళ్లు మంజూరు చేయగా, 104మంది ముగ్గు పోశారు. అందులో ఇద్దరికి మొదటి విడత రూ.లక్ష క్రెడిట్ అయ్యాయి. పలువురు ఇప్పుడిప్పుడే పనులను ప్రారంభిస్తున్నారు.

● గజ్వేల్ రూరల్ మండలంలో 25 గ్రామాల్లో 600 ఇళ్లను రెండు విడతల్లో మంజూరు చేయగా, అందులో 357 ఇళ్లకు మార్కవుట్ ఇచ్చారు. 20 మందికి మొదటి విడత రూ.లక్ష విడుదలయ్యాయి. గిరిపల్లిలో తొమ్మిది మందికి రూ.4 లక్షల వరకు నిధులు విడుదల కాగా, రెండు ఇళ్లు ప్రారంభానికి సిద్ధం అయ్యాయి. గృహప్రవేశం చేసిన అనంతరం మిగిలిన రూ.లక్ష ఖాతాల్లో జమచేయనున్నారు.

● జగదేవ్‌పూర్ మండలంలోని 24 గ్రామపంచాయతీల్లో 492 ఇళ్లు మంజూరవగా, 306 ఇళ్లకు మార్కవుట్ ఇవ్వగా 30 మందికి మొదటి విడత రూ.లక్ష జమకాగా, ఐదుగురికి రూ.2 లక్షలు చొప్పున జమయ్యాయి.

● కుకునూరుపల్లి మండలంలోని 10 గ్రామాల్లో 262 ఇళ్లు మంజూరవగా, 181 ఇళ్లకు ముగ్గు పోయగా అందులో 60 మందికి రూ.లక్ష, ముగ్గురికి రూ.2 లక్షలు, రూ.4 లక్షలు ఐదుగురికి, మేదినీపూర్‌లో దాదాపు 8 ఇళ్లు పూర్తికావచ్చాయి.

● ములుగు మండలంలోని 26 గ్రామాల్లో 333 ఇళ్లు మంజూరవగా, 222 ఇళ్లకు అనుమతిచ్చారు. ఇందులో ఇద్దరికి రూ.4లక్షలు, ముగ్గురికి రూ.3లక్షలు, ఒకరికి రూ.లక్ష నిధులు విడుదల అయ్యాయి.

● వర్గల్ మండలంలోలోని 27 గ్రామాల్లో 322 ఇళ్లు మంజూరవగా, 59 ఇళ్లను ప్రారంభించారు. అందులో 57 మందికి రూ.లక్ష చొప్పున నిధులు మంజూరయ్యాయి.

● కొండపాక మండలంలోని 16 గ్రామాల్లో 271 ఇళ్లు మంజూరవగా, 216 ఇళ్లకు అనుమతి లభించింది. అందులో 57 ఇళ్లకు రూ.లక్ష చొప్పున నిధులు మంజూరయ్యాయి.

● మర్కుక్ మండలంలోని 16 గ్రామాల్లో 297 ఇళ్లు మంజూరవగా, 136 ఇళ్లకు మార్కవుట్ ఇచ్చారు. అందులో 41 ఇళ్లకు రూ.లక్ష చొప్పున, 18 ఇళ్లకు రూ2 లక్షల చొప్పున నిధులు విడుదల అయ్యాయి.

కానిస్టేబుల్ స్వామికి సీపీ అభినందన

చేర్యాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పోలీస్ కానిస్టేబుల్ స్వామిని సిద్దిపేట సీపీ అనురాధ అభినందించారు. ఇటీవల ఓ వివాహిత పట్టణంలోని పెద్దచెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన స్వామి చెరువులోకి దూకి ఆమెను సురక్షితంగా బయటకు తీసుకొచ్చాడు. ఈ మేరకు ఆదివారం స్వామిని సీపీ అనురాధ అభినందిస్తూ ప్రశంసాపత్రంతో పాటు నగదు రివార్డుతో సత్కరించింది. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఏసీపీ సదానందం, చేర్యాల సీఐ ఎల్.శ్రీను, ఎస్ఐ నవీన్ పాల్గొన్నారు.

సెప్టెంబరు 1న పాత పెన్షన్ పోరాట సభ

- తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ కోచైర్మన్ అనిల్

గజ్వేల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పాత పెన్షన్ పోరాట సభను విజయవంతం చేయాలని తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ కో చైర్మన్ సీహెచ్. అనిల్ పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని టీపీటీఎఫ్ విద్యా సదస్సులో పాత పెన్షన్ పోరాట సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. సెప్టెంబరు 1న హైదరాబాద్‌లోని లలిత కళాతోరణం పబ్లిక్ గార్డెన్స్‌లో తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే పాత పెన్షన్ పోరాట సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కిష్టయ్య, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలీఅహ్మద్, యాదగిరి, జోన్ కన్వీనర్ శ్రీనివాస్, టీపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భగవాన్‌రెడ్డి



హరీశ్‌రావును కలిసిన నూతన కార్యవర్గం

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్(టీపీఎస్ఏ) నూతన కార్యవర్గం ఎన్నికైంది. జిల్లా అధ్యక్షుడిగా పీ.భగవాన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రజనీకాంత్‌రెడ్డి ఎన్నికయ్యారు. కోశాధికారిగా జి.సంపత్‌కుమార్, ఉపాధ్యక్షులుగా సంతోష్ కుమార్, లింగం, సంయుక్త కార్యదర్శిగా ఎం.రమేష్, ముఖ్య సలహాదారులుగా జి.వెంకటేష్, కిరణ్, ఉదయాకర్, మాళవిక, లావణ్యరెడ్డి, లీగల్ అడ్వైజర్‌గా సిహెచ్.సంతోష్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం హరీశ్‌రావును కలవడంతో.. ఆయన అభినందించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను సామాజిక బాధ్యత వైపు చైతన్యం తేవాలని సూచించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ త్వరలోనే కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు.

ఉనికి కోల్పోతామనే హంగామా

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గరిపల్లి రాములు

సిద్దిపేట రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : అధికారం పోగానే బీఆర్ఎస్ నాయకులు ఎక్కడ వాళ్ల ఉనికి కోల్పోతామనే నానా హంగామా చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గరిపల్లి రాములు ఆరోపించారు. అదివారం సిద్దిపేట రూరల్ మండలం బచ్చాయిపల్లి గ్రామంలో గ్రామపంచాయితీ భవనానికి నిధులు మంజూరు చేసినందుకు నాయకులు, గ్రామస్థులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. సిద్దిపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు, వాళ్ల సారు చెప్పే కాకమ్మ కథలు ప్రజలెవరు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దుర్గం యాదగిరి, రాజేశం, వెంకన్న, మల్లయ్య, ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మునిసిపాలిటీపై కాషాయజెండాను ఎగురవేద్దాం

- బీజేపీ సీనియర్ నాయకుడు మాదాడి జశ్వంత్‌రెడ్డి

గజ్వేల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీపై కాషాయజెండాను ఎగురవేద్దామని బీజేపీ సీనియర్ నాయకుడు మాదాడి జశ్వంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో బీజేపీ నాయకులు టేకులపల్లి రాంరెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో బీజేపీ బలోపేతానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. వారివెంట నాయకులు కుమారస్వామి, మధు, వెంకట్రాంరెడ్డి, ఏగొండ, భాస్కర్‌రెడ్డి, ప్రసాద్, కుడిక్యాల రాములు, నరేంద్ర, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.